

యాదాద్రి పవర్ ప్లాంట్ రెండో యూనిట్‌లో ఆయిల్ సింక్రనైజేషన్ ద్వారా పవర్ ఉత్పత్తి ట్రయల్ రన్‌ను ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి


నమస్తే తెలంగాణ

# సూర్యాపేట

5 | నల్లగొండ, గురువారం 12 సెప్టెంబర్ 2024 | SURYAPET


## వీధి కుక్కల దాడిలో చిన్నారులకు గాయాలు

చివ్వెంల, సెప్టెంబర్ 11 : మండలంలోని బండ మీది చందుపట్లలో బుధవారం రాత్రి వీధి కుక్కల దాడిలో ఐదుగురు చిన్నారులు గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాలు.. గ్రామంలోని ఓ వీధిలో చిన్నారులు శిగ జస్విత్, కాసోజు సోన్విత్, సిద్దోజు వివేక్ ఆడుకుంటుండగా అక్కడే ఉన్న కుక్కలు వీరిపై ఎగబడి దాడిచేసి గాయపర్చాయి. అదే విధంగా సాంఘీక సంక్షేమ వసతి గృహం వైపు మరో ఇద్దరు విద్యార్థులపై కూడా దాడి చేసినట్లు గ్రామస్తులు తెలిపారు. క్షతగాత్రులను సూర్యాపేట ప్రభుత్వ జనరల్ దవాఖానకు తరలించి చికిత్స అందిస్తున్నారు.



గాయపడ్డ చిన్నారులు

# ఈ ఏడాది చివరి వరకు మూడు యూనిట్లు పూర్తి

- భూ నిర్వాసితులకు ప్లాంట్‌లోనే ఉద్యోగాలు
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డితో కలిసి యాదాద్రి పవర్ ప్లాంట్ పనుల పరిశీలన
- రెండో యూనిట్‌లో ఆయిల్ సింక్రనైజేషన్‌తో ట్రయల్ రన్

నల్లగొండ ప్రతినిధి, సెప్టెంబర్11(నమస్తే తెలంగాణ) /దామరచర్ల : యాదాద్రి థర్మల్ పవర్ ప్రాజెక్టులో ప్రస్తుతం పనులు వేగంగా జరుగుతున్నాయని, ఈ ఏడాది చివరి వరకు మూడు యూనిట్లను రన్ చేయనున్నామని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో కలిసి బుధవారం ఆయన హెలికాప్టర్‌లో దామరచర్లలోని యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌కు వచ్చి పనులను పరిశీలించారు. అనంతరం అక్కడే ఉన్నతాధికారులతో పనుల పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా రెండో యూనిట్‌లో ఆయిల్ సింక్రనైజేషన్ ద్వారా పవర్ ఉత్పత్తి ట్రయల్ రన్‌కు స్విచ్ఆన్ చేశారు. అనంతరం ప్లాంట్ కాన్ఫరెన్స్ హాల్‌లో భట్టి మీడియాతో మాట్లాడారు. ఈ డిసెంబర్ 31 నాటికి మూడు యూనిట్లలో 2,400 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తిని ప్రారంభించనున్నట్లు ప్రకటించారు. వచ్చే ఏడాది మార్చి చివరి నాటికి మిగతా రెండు యూనిట్లను కూడా పూర్తి చేసి మొత్తం 5 యూనిట్ల ద్వారా పూర్థి సామర్థ్యంతో విద్యుత్ ఉత్పత్తిని ప్రారంభిస్తామన్నారు. మార్చి31 నాటికి విద్యుత్ అందించేందుకు సివిల్ పనులతో పాటు రైల్వే లైన్ పనులను కూడా వేగవంతం చేయనున్నట్లు చెప్పారు. రైల్వే లైన్ అందుబాటులోకి తేవడం వల్ల బొగ్గు రవాణా వ్యయం కూడా తగ్గుతుందన్నారు. ఇదే వేగంతో ప్లాంట్‌ను పూర్తి చేయడం ద్వారా యూనిట్ విద్యుత్‌ను 6.35రూపాయలకు ఇచ్చేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రాజెక్టు పూర్తయ్యే నాటికి ఖర్చును లెక్కకట్టి యూనిట్ ధర ఎంత అవుతుందనేది ఈఆర్‌సీ నిర్ణయిస్తుందని చెప్పారు. ప్రాజెక్టు నిర్మాణానికి ప్రజలు వారి ఎంతో విలువైన భూములను ఇచ్చి త్యాగం చేశారని, అలాంటి భూ నిర్వాసితులకు భూసేకరణ నిధులతోపాటు, ప్రాజెక్టులో తప్పనిసరిగా ఉద్యోగాలు కల్పిస్తామని తెలిపారు. ప్లాంటు ప్రారంభ సమయంలో ఇచ్చిన మాట ప్రకారం నిర్వాసితుల కుటుంబాల్లో నిరుద్యోగులైన వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ యాదాద్రి ప్లాంట్‌తోపాటు పులిచింతల ప్రాజెక్టులో భూములు కోల్పోయిన వారికి ఉద్యోగాలు కల్పిస్తామని డిప్యూటీ సీఎం ఆదేశాలిచ్చారని, వారికి నిర్వాసితుల తరపున ధన్యవాదాలు తెలిపారు. వారి వెంట జెన్‌కో సీఎండీ రోనాల్డ్ రోస్, మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, కలెక్టర్ నారాయణరెడ్డి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్, ప్రాజెక్టు డైరెక్టర్లు సచ్చిదానంద, అజయ్, ప్రాజెక్టు చీఫ్ ఇంజినీర్ సమ్మయ్య, తదితరులు ఉన్నారు.

### మంత్రులను నిలదీసిన నిర్వాసితులు

యాదాద్రి పవర్‌ప్లాంటుకు వచ్చిన డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డిని పవర్ ప్లాంట్ భూ నిర్వాసితులు, ల్యాండ్ లూసర్స్ బాధితులు అడ్డుకున్నారు. పవర్ ప్లాంట్‌కు భూములు ఇచ్చిన తమకు ఇంతవరకు ఎలాంటి ఉపాధి, ఉద్యోగాలు కల్పించలేదన్నారు. ధ్రువీకరణ పత్రాలు ఇచ్చారు కానీ ఉద్యోగాలు ఇవ్వలేదని వారిని నిలదీశారు. దీంతో స్పందించిన మంత్రులు నిర్వాసితులకు న్యాయం చేస్తామని, ప్లాంటుకు భూములు ఇచ్చిన నిర్వాసితులు దేవుళ్లతో సమానమని తెలిపారు. మూడు నెలల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించాలని అధికారులను ఆదేశించామని చెప్పడంతో నిర్వాసితులు ఆందోళన విరమించారు.



యాదాద్రి పవర్ ప్లాంట్ వద్ద డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని భూ నిర్వాసితులు నిలదీయడంతో వారికి సమాధానం చెప్తున్న దృశ్యం

# మిషన్ భగీరథ సిబ్బందికి జీతాల్లేవ్!

## నాలుగు నెలలుగా వేతనాలు ఇవ్వని రాష్ట్ర సర్కారు



జీతాలు ఇవ్వాలని నిరసన వ్యక్తం చేస్తున్న మిషన్ భగీరథ క్షేత్రస్థాయి సిబ్బంది (ఫైల్)

- అప్పులు చేసి కుటుంబాలను పోషిస్తున్న వైనం
- గ్రామాలకు నీటి సరఫరాపై ప్రభావం
- ధర్నాలు, ఆందోళనలు చేసినా పట్టించుకోని ప్రభుత్వం

**ఇంటింటికీ స్వచ్ఛమైన తాగునీటిని అందించే లక్ష్యంతో మాజీ సీఎం కేసీఆర్ ప్రతిష్టాత్మకంగా మిషన్ భగీరథ పథకాన్ని తీసుకొచ్చారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఇది విజయవంతంగా అమలైంది. మిషన్ భగీరథ సిబ్బందికి ప్రతి నెలా సకాలంలో జీతాలు అందించింది. ఎక్కడా నీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తలేదు. కానీ కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి వచ్చిన తర్వాత మిషన్ భగీరథ నిర్వహణ గాడి తప్పింది. క్షేత్రస్థాయిలో పనిచేసే సిబ్బందికి వేతనాలు ఇవ్వకపోవడంతో సమస్యలు తలెత్తుతున్నాయి. అనేక గ్రామాలకు తాగు నీటి సరఫరా సక్రమంగా కాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.**

– నేరేడుచర్ల, సెప్టెంబర్ 11

### వేతనాలు అందక అవస్థలు

నల్లగొండ జిల్లా మిర్యాలగూడ నియోజకవర్గ పరిధిలోని అవంతీపురం వద్ద ఉన్న మిషన్ భగీరథ ప్లాంట్ నుంచి సూర్యాపేట జిల్లాలోని హుజూర్‌నగర్, కోదాడ, సూర్యాపేట, నల్లగొండ జిల్లాలోని మిర్యాలగూడ నియోజకవర్గాల్లోని గ్రామాలకు మిషన్ భగీరథ నీటిని అందిస్తున్నారు. దీని కోసం వాల్ ఆపరేటర్లు, ఫిట్టర్లు, సూపర వైజర్లు ఇలా సుమారు 400 మంది క్షేత్ర స్థాయిలో సిబ్బంది పని చేస్తున్నారు. వీరికి రూ.10 వేల నుంచి రూ.15వేల వరకు వేతనాలుంటాయి. కానీ జూన్, జూలై, ఆగస్టు నెలల జీతాలను ప్రభుత్వం ఇవ్వలేదు. ప్రస్తుతం నాలుగో నెల కూడా జీతాలు రాలేదు. జీతాలు లేక ఆర్థికంగా చాలా ఇబ్బంది పడుతున్నామని, అప్పులు చేసి కుటుంబాన్ని పోషించుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



మిర్యాలగూడ డివిజన్ పరిధిలోని అవంతీపురం వద్ద ఉన్న మిషన్ భగీరథ ప్లాంట్

### జీతాలు రాక అష్టకష్టాలు పడుతున్నం

మాకు నాలుగు నెలలు నుంచి జీతాలు రావట్లేదు. రాత్రీపగలు పని చేసి తాగు నీటి సరఫరాలో ఇబ్బందుల్లేకుండా చూస్తున్నం. ఇంత కష్టపడ్డా ఫలితం లేదు. కుటుంబ పోషణకు అష్టకష్టాలు పడుతున్నం. ఇకనైనా సర్కారు స్పందించి సకాలంలో జీతాలు ఇవ్వాలి.

**-సందీప్ రెడ్డి, మిషన్ భగీరథ సూపర్‌వైజర్**

### అసలే జీతాలు తక్కువ

అవంతీపురంలోని మిషన్ భగీరథ ప్లాంటు నుంచి నాలుగు నియోజకవర్గాలకు నీటిని సరఫరా చేయడం కోసం సుమారు 400 మంది సిబ్బంది పని చేస్తున్నారు. మాకు ఇచ్చే జీతం కూడా చాలా తక్కువే. ఆ డబ్బులు కూడా నెల నెలా ఇవ్వడం లేదు. నాలుగు నెలలుగా అవస్థలు పడుతున్నాం. ప్రభుత్వం చొరవ తీసుకొని మా వేతనాలు విడుదల చేయాలి.

**-రవి, మిషన్ భగీరథ లైన్‌మన్**

## బురద రోడ్డులో అదుపు తప్పిన స్కూల్ బస్సు



మేళ్లచెర్వు శివారులో రోడ్డు పక్కకు దూసుకెళ్లిన స్కూల్ బస్సు

మేళ్లచెర్వు, సెప్టెంబర్ 11 : ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పలుచోట్ల రోడ్లు కొట్టుకుపోగా మరికొన్ని చోట్ల గుంతలు పడి బురదమయంగా మారాయి. మేళ్లచెర్వు నుంచి చింతలపాలెం దారి పూర్తిగా బురదమయంగా మారడంతో బుధవారం ఓ ప్రైవేట్ స్కూల్ బస్సు అదుపు తప్పింది. కొంత వరకు రోడ్డు పక్కనున్న పొలాల్లోకి దూసుకెళ్లింది. డ్రైవర్ అప్రమత్తతతో బస్సును నియంత్రించడంతో పెను ప్రమాదం తప్పింది. నిత్యం ఈ మార్గంలో లారీలు, బస్సులు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. వెంటనే రోడ్డు మరమ్మతులు చేయించి ప్రమాదాలను నివారించాలని వాహనదారులు కోరుతున్నారు.

# పరిపాలనలో కాంగ్రెస్ విఫలం

- కమీషన్ల కోసమే హైడ్రా ఏర్పాటు
- పేదల జీవితాలతో చెలగాటమాడుతున్న గుంపు మేస్త్రీ
- విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

కేతేపల్లి, సెప్టెంబర్ 11 : కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు జరిగి పది నెలలు దాటినా పరిపాలనలో పూర్తిగా విఫలమైందని మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య విమర్శించారు. మండల పరిధిలోని ఇనుపాములలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రతిపక్షాలపై చిల్లర మాటలు మాట్లాడటం మినహాయించి సీఎం రేవంత్‌రెడ్డికి ఏమీ తెలియడం లేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలకు విష జ్వరాలు ప్రబలడంతో ప్రభుత్వ దవాఖానలు కిక్కిరిసిపోతున్నాయని, ఆసుపత్రుల్లో కనీస సౌకర్యాలను కల్పించడంలో, మందుల కొరతపై దృష్టి పెట్టడం లేదని తెలిపారు. రూ.2 లక్షల రుణమాఫీ ఇంత వరకు పూర్తి చేయకపోవడం ప్రభుత్వ చేతకాని తనానికి నిదర్శనమన్నారు. వానకాలం పంటకాలం పూర్తికావస్తున్నప్పటికీ ప్రభుత్వం రైతుబంధు ఊసెత్తకపోవడం సిగ్గుచేటని మండిపడ్డారు. దేవుళ్ల మీద ప్రమాణాలు చేసి మాటతప్పడం సీఎం రేవంత్‌రెడ్డికే చెల్లిందన్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో మంత్రులుగానీ, ఎమ్మెల్యేలుగానీ అందుబాటులో లేకుండా ప్రజలను గాలికి వదిలేశారని దుయ్యబట్టారు. ప్రత్యేకాధికారుల పాలనలో గ్రామాలు చిన్నాభిన్నం అవుతున్నాయని, పారిశుధ్య పనులు పనులు చేపట్టక పోవడంతో విషజ్వరాలు వ్యాపిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సర్పంచుల పదవీకాలం ముగిసి ఏడు నెలలు దాటినప్పటికీ ఇంత వరకు గ్రామ పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించకపోవడమేంటని ప్రశ్నించారు. అన్ని విధాలుగా నమ్మించి మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే ప్రజలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

హైదరాబాద్‌లో కేవలం కమీషన్ల కోసమే హైడ్రాను తెరమీదకు తీసుకువచ్చారని విమర్శించారు. హైడ్రా ఏర్పాటుతో పేద, మధ్యతరగతి కుటుంబాల ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారని, పేదల జీవితాలతో చెలగాటమాడుతూ గుంపుమేస్త్రీ కాలం గడుపుతున్నాడని మండిపడ్డారు. సమావేశంలో మాజీ జడ్పీటీసీ బొప్పని స్వర్ణలతాసురేశ్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మారం వెంకట్‌రెడ్డి, నాయకులు కొప్పుల ప్రదీప్‌రెడ్డి, జాల వెంకట్‌రెడ్డి, ఎం.రాగ్ని, జి.సత్యనారాయణగౌడ్, సీహెచ్.గోపాల్‌గౌడ్ పాల్గొన్నారు.

# వరద ముంచెత్తినా కన్నెత్తి చూడని అధికారులు

- ఇటీవల భారీ వర్షాలకు తెగిన ఎర్రవరం చెరువు కట్ట
- మునిగిన పంట పొలాలు.. పలు దుకాణాలు

కోదాడ రూరల్, సెప్టెంబర్11 : ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కోదాడ మండలంలో తీవ్ర నష్టం జరిగింది. వరదలకు పంట పొలాలు మునిగాయి. రోడ్లు, విద్యుత్ వ్యవస్థ దెబ్బతిన్నది. పలు చోట్ల చెరువులకు గండ్లు పడడంతో పొలాలన్నీ ఇసుక మేటలతో నిండాయి. తీవ్ర నష్టం జరుగడంతో రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. మండల పరిధిలోని ఎర్రవరంలో వరదలకు చెరువు కట్ట తెగి పంట పొలాలు నీట మునిగాయి. వరద నీటితో ప్రసిద్ధ దుళ్లగుట్ట బాల ఉగ్రనరసింహ స్వామి దేవాయల ప్రాంగణంలోని దుకాణదారులు సామగ్రి తడవడంతో భారీగా నష్టపోయారు. విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు కూడా కూలిపోయాయి. దీనికి తోడు గ్రామంలో పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారి విష జ్వరాలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. వరదలు వచ్చి 10 రోజులు కావస్తున్నప్పటికీ ఇప్పటివరకు గ్రామానికి ఒక్క అధికారి, ప్రజా ప్రతినిధులు రాలేదని వరద బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మునిగిన పొలాలు, దుకాణాలను చూసే వారే లేరని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికీ చెరువు కట్ట నిర్మాణం చేపట్టకపోవడంతో గ్రామస్తులు అవస్థలు పడుతున్నారు.



ఎర్రవరంలో తెగిన చెరువు కట్ట



ఎర్రవరంలో కాకి ప్రసాద్ పొలంలో వేసిన ఇసుక మేటలు

### నాలుగు ఎకరాల్లో ఇసుకమేట వేసింది

నాకున్న నాలుగు ఎకరాల్లో వరద పారి పూర్తిగా ఇసుక మేట వేసింది. ఎకరానికి 17 వేలు చొప్పున పెట్టుబడి పెట్టి రెక్కల కష్టంతో పొలం నాటుపెట్టినం. మా బాధలు తెలుసుకునేందుకు ఇంత వరకు ఏ అధికారి వచ్చిన పాపన పోలేదు. పొలంలో ఇసుక మేట తొలగించడానికే ఎక్కువ ఖర్చు అయ్యేట్లుగా ఉంది. ప్రభుత్వం ఆదుకోవాలి.

**- కాకి ప్రసాద్, రైతు, ఎర్రవరం, కోదాడ మండలం**

### ప్రభుత్వం ఆదుకోవాలి



వరదలకు మా పొలాలు కొట్టుకుపోయాయి. ఈ సారి మొత్తం నష్టమే మిగిలింది. వరద బాధితులను పరామర్శించేందుకు ఇప్పటి వరకు మా గ్రామానికి ఏ అధికారి, నాయకులు రాలేదు. మా నష్టం, మా బాధలు పైఅధికారులకు ఎలా తెలుస్తాయి. ఇప్పటికైనా సార్లు వచ్చి మునిగిన పంట పొలాలు పరిశీలించాలి

**-బంటి వెంకట నర్సమ్మ, ఎర్రవరం, కోదాడ మండలం**

# ఓటుకు 25 వేలు..!

## మదర్ డెయిరీ డైరెక్టర్ల ఎన్నికల్లో కాంగ్రెస్ ఆఫర్




మదర్ డెయిరీ కార్యాలయం

- ప్రలోభాలు, తాయిలాలతో ఎర.. క్యాంప్ రాజకీయాలకు తెర
- హైదరాబాద్ క్యాంప్‌లో మందు, విందు, చిందు.
- అత్యధిక మంది ఓటర్లున్నా ధీమా లేని హస్తం పార్టీ
- గెలిచేందుకు బీఆర్ఎస్ పకడ్బందీ వ్యూహాలు
- రేపు హయత్‌నగర్‌లో ఆరు డైరెక్టర్ స్థానాలకు ఎన్నిక

యాదాద్రి భువనగిరి, సెప్టెంబర్ 11 (నమస్తే తెలంగాణ) : ఉమ్మడి నల్లగొండ–రంగారెడ్డి జిల్లాల పాల ఉత్పత్తిదారుల సంఘం (మదర్ డెయిరీ) ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రలోభాలకు తెరలేపింది. అధికారంలో ఉండటంతో ఎలాగైనా గెలవాలని అడ్డదారులు తొక్కుతున్నది. ఓటర్లైన పాల సంఘం చైర్మన్లకు తాయిలాలతో ఎర వేస్తున్నది. ఒక్కో ఓటరుకు రూ. 25వేలు ఆఫర్ చేసింది. ఇప్పటికే ఓటర్లను క్యాంప్‌లకు తరలించి దావత్‌లతో ముంచెత్తుతున్నది.

మదర్ డెయిరీ ఎన్నికలు ఉమ్మడి జిల్లాలో కాక రేపుతున్నాయి. ఎన్నికలను బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. ఆరు డైరెక్టర్ స్థానాలకు ఎన్నికలు జరుగుతున్నాయి. ఇందులో ఉమ్మడి నల్లగొండలో నాలుగు, రంగారెడ్డి జిల్లాలో రెండు స్థానాలు ఉన్నాయి. కాంగ్రెస్ తరపున ఆరుగురు, బీఆర్ఎస్ నుంచి 12 మంది అభ్యర్థులు పోటీలో నిలిచారు. మొత్తంగా 297 మంది పాల సొసైటీ చైర్మన్లుగా ఓటర్లు ఉన్నారు. వీరందరు కలిసి ఆరుగురిని డైరెక్టర్లుగా ఎన్నుకోనున్నారు. ఇప్పటికే ఆయా అభ్యర్థుల సీరియల్ నంబర్లు కేటాయించారు. ఈ నెల 13న హయత్ నగర్‌లోని మదర్ డెయిరీ ప్రధాన కార్యాలయంలో అభ్యర్థుల ఎన్నిక నిర్వహించనున్నారు.

### పరువు పోతుందని ఆఫర్..!

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 12 అసెంబ్లీ స్థానాల్లో 11 సీట్లలో కాంగ్రెస్ గెలిచింది. అయితే బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య గట్టి పోటీ నెలకొంది ఉంది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ఎలాగైనా చైర్మన్ పీఠం దక్కించుకోవాలని, లేకుంటే పరువు పోతుందనే భావనలో ఉన్నట్లు తెలుస్తున్నది. ఆలేరు నియోజకర్గంలో అత్యధికంగా ఓటర్లున్న బీర్ల ఐలయ్యకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. దీంతో ఒక్కో ఓటరుకు రూ. 25వేలు ఆఫర్ చేసినట్లు విశ్వసనీయ సమాచారం. అది కూడా ఎన్నికకు కొంత సమయం ముందే ఇచ్చేట్లు సంప్రదింపులు జరిపినట్లు తెలుస్తున్నది. ప్రస్తుతం క్యాంప్‌లో 150 మంది వరకు ఉన్నట్లు సమాచారం.

### గులాబీ పార్టీ పకడ్బందీ వ్యూహాలు..

అధికార కాంగ్రెస్ పార్టీకి దీటుగా బీఆర్ఎస్ ఎత్తులకు పై ఎత్తులు వేస్తున్నది. ఎన్నికను సీరియస్‌గా తీసుకొని పకడ్బందీ వ్యూహాలు రచిస్తున్నది. డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డి ముందుండి అన్నీ తానై చూసుకుంటున్నారు. తమ ఓటర్లను కాపాడుకుంటూనే.. అవతలి ఓటర్ల మద్దతు కూడగట్టేలా చక్రం తిప్పుతున్నారు. బీఆర్ఎస్ తరపున యాదాద్రి జిల్లా నుంచి సందిల భాస్కర్, మారెడ్డి కొండల్ రెడ్డి, ఒగ్గు భిక్షపతి, డి.సోమిరెడ్డి పోటీలో ఉన్నారు. ఈ నలుగురు కచ్చితంగా గెలుస్తారని గులాబీ పార్టీ నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు.